




*వాస్తవంగా జరిగిన పద్మనాభ యుద్ధంలో సంఘటనలు, చారిత్రక అంశాలను క్రోడీకరించి ఆనాటి రాజకీయ సాంఘిక నేపథ్యాలను ఆధారంగా చేసుకుని సంఘటనలను అల్లుకుని రాసిన చారిత్రక నవల. వ్యక్తులు ప్రదేశాలు సన్నివేశాలను కథారూపంలో తయారు చేయడం జరిగింది. యుద్ధం జరగడం వెనుక కారణాలను వివరించడానికి కథారూపంలో విస్తరించడం వల్ల పాఠకులు సులభంగా చదువుకోవడమే కాకుండా చరిత్రలో మరుగున పడిపోతున్న క్షత్రియుల పోరాట పటిమకు, పౌరుషానికి, బ్రిటిష్‌వారి సార్వభౌమత్వాన్ని ధిక్కరించి, ఎదిరించి నిలిచి వీరోచితపోరాటం చేసినవారి స్ఫూర్తిని తెలియజేయడానికి నవలారూపంలో రాసిన చారిత్రక సంఘటనల మాలిక ఈ రుధిర సంగ్రామం.*

*పరాయిపాలకుల దాస్య శృంఖలాలను తెంచుకోవాలని ప్రాణాలొడ్డి పోరాటాలు చేసిన ఎంతోమంది వీరులు ఉత్తరాంధ్ర జిల్లాలో ఉన్నారు. బ్రిటిష్‌వారి దాష్టీకాలను ఎదుర్కోవడానికి వీరోచితమైన యుద్ధం చేసి అసువులు బాసిన ఎంతోమంది వీరాధివీరుల్లో చిన విజయరామరాజు ఒకరు. విజయనగర సంస్థానానికి చెందిన ఈయన ఉత్తరాంధ్ర జిల్లాలో సామంతరాజుల్ని కూడగట్టుకుని బ్రిటిష్ వారిపై 1794లో చేసిన పోరాటం స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఈ యుద్ధంలో ఎంతోమంది బ్రిటిష్‌వారు చనిపోయారు. బ్రిటిష్ సైనికులు తుపాకులతో చేసిన పోరాటానికి వీరావేశంతో వచ్చిన వీరాధివీరులైన రాజుల చేతిలో చిక్కి విగతజీవులయ్యారు. తెలుగుజాతి ఆత్మాభిమానాన్ని నిలబెట్టడానికి, తెలుగుతేజాన్ని నిరూపించడానికి, బానిసబతుకుల్ని ఎదిరించాలన్న రాజుల పౌరుషాన్ని చూపించడానికి. పరాయి పాలకుల పీడను విరగడ చేయడానికి తెలుగువారి దాస్యశృంఖలాలు తొలగించడానికి చేసిన పోరాటం పద్మనాభయుద్ధంగా చరిత్రలో నిలిచిపోయింది.*

*భారతదేశంలో ఎన్నో ప్రాంతాల్లో ఎంతోమంది వీరులు పోరాటాలు చేశారు. ఈ దేశం మాది మీరు మీ దేశం పొండని తిరుగుబాట్లకు పాల్పడ్డారు. బ్రిటిష్‌వారిని ఎదిరించి దేశభక్తులుగా నిలిచారు. ఇతర ప్రాంతాలకు చెందిన ఎంతోమంది స్వాతంత్ర సమరయోధుల వీరగాధలు చరిత్రలో నిక్షిప్తం అయ్యాయి. అయితే విజయనగర రాజులు వీరోచిత పోరాట చరిత్ర పద్మనాభ యుద్ధానికి ఉంది. ఇతర ప్రాంతాలలో జరిగిన పోరాటాలతో పోలిస్తే విభిన్నమైన ఈ యుద్ధ చరిత్ర దాని నేపధ్యం చాలావరకు అజ్ఞాతంగానే ఉండిపోయింది. విశాఖ మాన్యుయేల్‌లో లార్డు కార్మికేల్ మాత్రం ఈ యుద్ధంలో చనిపోయిన వీరుల వివరాలను నిక్షిప్తం చేశారు. ఈ పద్మనాభ యుద్ధాన్ని స్కాట్లాండులో జరిగిన లాడెన్ సంఘటనతో చరిత్రకారులు పోలుస్తుంటారు. 1794లో జరిగిన ఈ యుద్ధం దాని చారిత్రక నేపథ్యంతో రాసిన నవల.*

(గతసంచికతరువాయి)

**యుద్ధం ప్రారంభం**

విజయరామరాజు మనసు బాగోలేదు. ఏదో దిగులు మనసంతా ఆవరించింది. సంస్థానంలో మహారాజుగా ఉన్న వైభవంగా జరిగిన విజయనగర ప్రాభవం ఒకసారి గుర్తుకు వచ్చింది. విశాలమైన కోటలో సకల సౌకర్యాలతోపాటు వంది మాగదులు, పిలిస్తే పలికే సైనికులు, సిబ్బంది ఇప్పుడు ఎవరూ కనిపించడంలేదు.

వంటరితనం మానసిక క్షోభను గురిచేస్తోంది.

విజయనగర కోట స్వాధీనం జరిగిపోయినట్లే.

ఈస్టు ఇండియా కంపెనీ భారతదేశంలో వేళ్ళూనుకుని పోయి ఒక్కొక్క స్వామ్రాజ్యాన్ని సంస్థానాన్ని స్వాధీనం చేసుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

1793 ఆగస్టు 3 ఉదయం పదిగంటలు

విశాఖపట్నం నుంచి కంపెనీ అధికారులు విజయనగరం విచ్చేసారు.

విశాలమైన విజయనగరం కోటను తమకు స్వాధీనం చేయాలన్న ఉత్తర్వుల కాపీని అందించారు. సిబ్బంది వాటిని అందుకుని సమాధానం చెప్పలేకపోయారు. వారు తెచ్చిన పత్రాలపై అందినట్లు సంతకాలు చేయడం మినహా ఏమీ చేయలేకపోయారు.

అన్ని లాంఛనాలు పూర్తి చేయడానికి రెండుగంటలు పట్టింది.

పురాతనమైన విజయనగరం కోట బ్రిటిష్ అధికారుల స్వాధీనం అయిపోయింది.

సంబంధిత అధికారులు కోటను స్వాధీనం చేసుకున్నామని తమ ఆధీనంలో ఉందని స్వాధీన పత్రాలను అందించారు.

అప్పటినుంచి విజయనగరం కోట అధికారికంగా ఈస్టుఇండియా కంపెనీ వారికి వశమైపోయింది.

విశాఖపట్నం నుంచి రెండు పటాలాల సైనికులు విజయనగరం చేరుకున్నారు. ఖాళీ చేయించబడిన గదుల్లో సర్దుకున్నారు. అంతవరకు రాజాస్థానంలో ఉన్న వారు అక్కడి నుంచి నిష్క్రమించే పనిలో తమ సామాన్లను సర్దుకున్నారు.

సింహాచలంలో ఉన్న విజయరామరాజుకు ఈ విషయాలు ఎప్పటికప్పుడు తెలుస్తూనే ఉన్నాయి. వేగులు సమాచారాన్ని అందిస్తున్నారు.

తాను బ్రిటిష్ కంపెనీకి బకాయి పడిన మొత్తం తక్కువే అయినప్పటికీ కోటను స్వాధీనం చేసుకోవడం ఏదోలా ఉంది. అంతవరకు తాను ఉంటున్న ఇంటిని బలవంతంగా ఎవరో ఖాళీ చేయించినట్లు మనసు బాధ పడింది.

సిబ్బంది కొంతమంది విజయనగరం వచ్చినా అధికారులు రాలేదు.

కోటను స్వాధీనం చేసుకున్నా దానిని ఎలా పరిపాలించాలి? ఎవరికి ఎటువంటి ఆదేశాలు జారీ చేయాలన్న విషయంలో వారికి ఎటువంటి ఆదేశాలు అనుమతులు లేవు. అక్టోబరు 29 వరకు పరిస్థితి అదే విధంగా ఉంది.

అక్టోబరు 30 మద్రాసు ఛీఫ్ నుంచి విశాఖపట్నం అధికారులకు ఆదేశాలు అందాయి. విజయనగరం కోటనుంచి పరిపాలనకు శ్రీకారం చుట్టాలని అందులో వివరించారు. మొత్త మోఖాసాదారుల వివరాలు అందుబాటులో తీసుకోవాలని వారినుంచి రావల్సిన బకాయిల మొత్తాలను అంచనా వేయాలని వాటిని వసూలు చేయాలని అందులో కోరారు. విజయనగరం సంస్థానం నుంచి బ్రిటిష్ కంపెనీకి బకాయి పడిన మొత్తం సొమ్ముని వసూలు చేయడానికి కార్యక్రమాన్ని తయారు చేయాలని అందులో కోరారు.

మద్రాసు అధికారుల సూచనలు చకచకా అమలు జరిగిపోయాయి.

భూమి శిస్తులు ఇతర పన్నులు వసూలు చేయడానికి విజయనగరాన్ని మూడు విభాగాలుగా విభజించారు. విశాఖపట్నం చీఫ్ షామియర్‌ను పరిపాలకునిగా నియమించారు. దక్షిణ విభాగానికి జాన్‌స్నో, ఉత్తర విభాగానికి ఆర్దర్ విలియం గ్రేగరీని నియమించి వారికి బాధ్యతల్ని అప్పగించారు. వారు పన్నులు వసూలు చేస్తారుగాబట్టి వారికి కలెక్టర్లు అని నామకరణం చేసారు.

ఈ ముగ్గురూ బాధ్యతలు తీసుకోగానే వసూలు పనిలో పడిపోయారు.

పాత లెక్కలు చిట్టాలు బైటికి తీసి విజయనగరం సంస్థానం నుంచి రావల్సిన మొత్తాన్ని అంచనా వేసారు. ఆ మొత్తం 1793 ఆగస్టు 9 నాటికి రూ.6.73,358గా ఉన్నట్లు నిర్ధారించారు. ఈ మొత్తాన్ని రైతుల నుంచి మోఖాసాదారుల నుంచి వసూలు చేసే ప్రయత్నాలను ప్రారంభించారు. ఈ విషయాన్ని విజయరామరాజుకు కూడా వర్తమానం పంపించారు.

ఈ వసూలు విషయంలో ముగ్గురు కలెక్టరు తీవ్రంగా ప్రయత్నాలు చేసారు.

విజయనగరం సంస్థానం పరిధిలో ఉన్న వివిధ గ్రామాలు ఇతర ప్రాంతాలపై దృష్టి పెట్టారు. ఎవరు ఎంతెంత బకాయిలు ఉన్నారో వారికి ముందుగా సమాచారాన్ని అందించారు. పన్నుల భారం అధికం అయిపోయిందని చాలామంది రైతులు ఆందోళన చెందారు.

కొంతమంది విజయరామరాజుకు విషయాలను చేరవేసారు.

"రైతులు పట్ల సానుకూలంగా వ్యవహరించడం వల్ల సకాలంలో పన్నులు వసూలుకాలేదు. అందువల్ల కోటను వదిలి రావల్సి వచ్చింది. వారికి చెల్లించవలసిన పన్నులు వారే వసూలు చేసుకోవడానికి సిద్ధపడ్డారు. వారికి సహకరించడం తప్పులేదు. రుణ విముక్తి ఎంత తొందరగా పొందితే అంత తొందరగా మన కోటను మనం చేరుకోగలం" విజయరామరాజు సంస్థానంలో రాజులకు మొఖాసాదారులకు సమాధానం ఇచ్చాడు.

అతని సమాధానాన్ని చాలామంది సందేశంగా తీసుకున్నారు.

కష్టాలలో ఉన్నవారు కష్టాలను భరించారు. తీర్చవలసిన అప్పులు పంట చేతికి రాకపోయినా ఫలసాయం అనుకున్న విధంగా దిగుబడి కాకపోయినా అప్పులు చేసి చెల్లించవలసిన బకాయిలను జమ చేయడం ప్రారంభించారు. కంపెనీ బకాయి పీడ విరగడ అవుతుందని చాలామంది తమకు అవకాశం లేకపోయినా చెల్లింపులకు సిద్ధపడ్డారు.

మొత్తం వసూలును కలెక్టర్లు లెక్కించారు.

1794 ఫిబ్రవరి 16 తేదీన అధికారుల సమక్షంలో లెక్కలు వేసారు.

రూ.6.50 లక్షలు వసూలు అయినట్లు తేలింది. ఈ సమాచారం విజయరామరాజుకు ఆనందాన్ని కలిగించింది.

సంస్థానం చెల్లించవలసిన బకాయి సొమ్ము వసూలు అయిపోనందున స్వాధీనం చేసుకున్న కోటను తిరిగి అప్పగిస్తారని ఆశించాడు. బకాయిలు అన్నీ చెల్లించినట్లయితే స్వాధీనం చేసుకున్న కోటను తిరిగి అప్పగిస్తామని మద్రాసు అధికారులు తమను హామీ ఇచ్చారని ఆ మేరకు తన సంస్థానంలో మొఖాసాదారులు రైతులు చిన్న సంస్థానాధీశులు అవకాశం లేకపోయినా బకాయిలను చెల్లించారని ఈ విషయాన్ని బ్రిటిష్ అధికారులు గుర్తించాలని విజయరామరాజు బహిరంగ ప్రకటన చేసాడు.

ఈ ప్రకటన కంపెనీ అధికారులకు కోపం తెప్పించింది.

దీంతో విజయరామరాజు తన మద్దత్తుదారులతో సింహాచలంలో సమావేశం జరిపాడు "కోటను తిరిగి స్వాధీనం చేస్తామన్న హామీ మేరకు తాను బకాయిలను చెల్లించాలని పిలుపునిచ్చానని దానికి అందరూ సానుకూలంగా స్పందించారని అయితే బ్రిటిష్ అధికారులు ఈ విషయాన్ని వేరుగా అర్థంచేసుకున్నారని" అన్నాడు.

"కలెక్టర్లు పంపిన నివేదికల వల్ల ఇటువంటి ఆలోచనలు రేకెత్తాయని" పద్మరాజు ఆరోపించాడు. ఆయన మాటలకు చాలామంది రైతులు మద్దతు పలికారు. ఈ విషయంలో అధికారుల వైఖరిని ఖండించవలసిన అవసరం ఉందని అన్నారు.

ఈ సమయంలో మద్రాసు నుంచి కంపెనీ అధికారులు మరో రకమైన ఆదేశాలను జారీ చేసారు. అందులో మొఖాసాదారులు ఇతర రైతుల నుంచి కంపెనీ నిర్ణయించే శిస్తులను పన్నులను రానున్న మూడు సంవత్సరాల వరకు తీసుకోగలమని మిగిలిన ప్రాంతాలలో అధికశిస్తులు చెల్లించగల వారిని మూడు సంవత్సరాల పాటు ఇజారుదార్లు (భూమి హక్కు కలిగినవారు)గా గుర్తించగలమని ప్రకటనలు వెలువరించారు. ఇందుకు సంబంధించి ఎవరెవరికి ఈ అవకాశం కావాలో టెండరు వేయాలని ప్రకటన కాపీలను పంపించారు.

ఈ విషయం రాజులందరికి ఆగ్రహాన్ని కలిగించింది.

ఎవరూ టెండరు వేయకూడదని నిర్ణయించారు.

ఆ తర్వాత తీవ్ర తర్జన భర్జనలు జరిగాయి. సమావేశం జరిపి సామంత రాజులంతా ఒక నిర్ణయానికి వచ్చారు. దాని ప్రకారం ఒక ప్రతిపాదన తయారు చేసారు. ఈ విషయాలన్నీ క్రోడీకరించి విజయరామరాజు మార్చి 28న కంపెనీ అధికారులకి లేఖ రాసాడు.

ఆ లేఖలో కంపెనీ వారు విజయనగర సంస్థానానికి చెల్లించవలసిన వాణిజ్య, రేవు, రవాణా, పన్నులు వంటివి లక్షలలో ఉన్నాయని వాటిని తమ సంస్థానానికి చెల్లించకుండా మినహాయించుకోవాలని అవి కాకుండా మిగిలిన బకాయిలను తాము చెల్లించగమని రైతులు అంటున్నారని పేర్కొన్నాడు. రానున్న 1794 - 95 సంవత్సరాలకు మహారాజు చెల్లించవలసిన పేష్కను మొత్తాన్ని నాలుగు వాయిదాలలో తాము చెల్లిస్తామని హామీ ఇచ్చారని ఇందులో పేర్కొన్నారు. తర్వాత సంవత్సరాలలో సంస్థానం చెల్లించవలసిన బకాయిలకు కూడా తాము బాధ్యర్త వహిస్తామని వారు తెలియజేసారని అందువల్ల ఈ విషయాలను తమ దృష్టికి తీసుకుని వస్తున్నానని ఈ లేఖలో పేర్కొన్నారు.

ఈ ఉత్తరానికి కంపెనీ అధికారుల నుంచి సానుకూలమైన స్పందన రాలేదు. విజయరామరాజు తన రైతుల అభ్యర్ధన తెలియజేసినప్పటికీ వారు ఏ నిర్ణయాన్ని తీసుకోలేదు.

ఆ తర్వాత విజయరామరాజు మళ్ళీ ఏప్రిల్ 8న మరో లేఖ రాసారు.

అందులో తన సంస్థానంలో ప్రముఖులు చేసిన ప్రతిపాదన అంగీకరించాలని స్వాధీనం చేసుకున్న విజయనగరం కోటను తిరిగి అప్పగించాలని ఇందులో కోరారు. అంతే కాకుండా కంపెనీ అధికారులు తనకు వాణిజ్య రవాణా సుంకాలుగ చెల్లించవలసిన రూ.4.50 లక్షల సంగతి ముందు తేల్చాలని కోరాడు.

ఈ రెండవ లేఖకు కూడా ఎటువంటి ప్రతిస్పందన రాలేదు.

బ్రిటిష్ అధికారులు తన లేఖల పట్ల ప్రదర్శిస్తున్న ఈ నిర్లక్ష్య వైఖరి పట్ల విజయరామరాజులో ఆగ్రహాన్ని కలిగించింది, బ్రిటిష్ వారితో తాడో పేడో తేల్చుకోవలసిన సమయం ఆసన్నమైందని అతను మనసులో అనుకున్నాడు. అదే సమయంలో మద్రాసులో ఉన్న బ్రిటిష్ కంపెనీ అధికారులు కూడా విజయరామరాజు పట్ల చూసీ చూడనట్లు వ్యవహరించకూడదని అతని పట్ల కఠిన వైఖరిని అవలంభించాలని నిర్ణయించారు.

ఈ నిర్ణయం ఇరు వర్గాల పై పెద్ద అఘాతాన్ని సృష్టించింది.

ఇది పద్మనాభంలో రాజుల సంగ్రామానికి నాంది పలికింది.

విజయరామరాజుపై బ్రిటిష్ అధికారుల ఆగ్రహం

తమకు అణిగి మణిగి ఉండవలసిన ఒక సంస్థానాధీశుడు తమకు లేఖలు రాయడం తమను ఆదేశించడం బ్రిటిష్ వారికి ఆగ్రహాన్ని తెప్పించింది. స్వదేశీ రాజు తమకు ఎదురు తిరిగే పరిస్థితిని వారు తట్టుకోలేకపోయారు. విజయనగరానికి దగ్గరగా నివశించడం, ఈ ప్రాంతంలో రైతులతో సన్నిహితంగా ఉండటం వల్ల ఇటువంటి హెచ్చరికలు ఆదేశాలు చేయగలుగుతున్నాడని అందువల్ల ఇతడిని విజయనగరానికి ఈ పరిసర ప్రాంతాలకు వీలైనంత దూరంగా పంపించాలని బ్రిటిష్ అధికారులు నిర్ణయాన్ని తీసుకున్నారు. విజయరామరాజు విషయంలో కఠినంగా వ్యవహరించాలని పైస్థాయి నుంచి ఆదేశాలు కూడా జారీ అయ్యాయి.

సంస్థానం భూములను లీజుకు ఇచ్చే విషయంలో మరోసారి టెండరును జారీ చేయాలని రాజుకు వ్యతిరేకంగా లీజుకు తీసుకునేవారిని ఎంపిక చేయాలని కంపెనీకి సంబంధించిన రెవిన్యూబోర్డు మరోసారి నోటీసును జారీ చేసింది. ఈ నోటీసులో గతంలో కూడా ఇటువంటి టెండరు నోటీసులు జారీ చేసినప్పటికీ ఎవరూ ముందుకు రావడం లేదని దానికి విజయరామరాజు పరోక్షంగా కారకుడని బ్రిటిష్ రెవిన్యూ బోర్డు నమ్ముతోందని కూడా అధికారులు ఇందులో పేర్కొన్నారు. అందువల్ల విజయరామరాజుపై చర్యలు తీసుకోవాలని ఈ ఉత్తర్వులలో స్పష్టంగా తెలియజేసారు.

రెవిన్యూ బోర్డు జారీ చేసిన ఈ నోటీసును కూడా సంస్థానికి పంపించారు.

ఈ విషయాలను వివరిస్తూ ఏప్రిల్ 25న విజయరామరాజుకు ఒక లేఖను పంపించింది. అందులో విజయరామరాజు చెప్పిన విషయాలను కంపెనీ అధికారులు అంగీకరించడం లేదని బకాయిలు చెల్లించనందువల్ల విజయనగరం పరిసర ప్రాంతాలను వదిలి దూరంగా వెళ్ళిపోవడానికి ఒక తేదీని నిర్ణయించుకోవాలని ఇందులో కోరారు.

ఈ లేఖ అందుకున్న విజయరామరాజు ఖిన్నుడైపోయాడు.

బ్రిటిష్ కంపెనీ తనపట్ల ఎందుకింత కక్షసాధింపు చర్యలు తీసుకుంటున్నదో అర్థంకావడంలేదని తన సన్నిహితుల వద్దవాపోయాడు. తనకు రావల్సిన బకాయిలు గురించి మాట్లాడకుండా తాను చెల్లించవలసిన పేష్కను బకాయిలు రాబట్టడానికి ప్రయత్నాలు చేస్తోందని వాయిదాలలో చెల్లించడానికి అనుమతి కోరినా ఇవ్వడం లేదని కేవలం తనను విజయనగరం సంస్థానం నుంచి దూరం ఇటువంటి ఆలోచనలు చేస్తోందని బాధపడ్డాడు.

తనకు కర్తవ్యంగా ఏమి చేయాలో అర్ధంకాలేదు.

కంపెనీ ఛీఫ్‌ని కలిసి విషయాలను వివరించాలని సన్నిహితులుగా ఉన్న రాజులు కొంతమంది సూచించారు.

మే 1న విజయరామరాజు ఛీఫ్‌ని కలుసుకున్నాడు.

తన పట్ల బ్రిటిష్ కంపెనీ అధికారులు కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నారని తీవ్రమైన అసంతృప్తిని వ్యక్తం చేసాడు.

చీఫ్‌తో రెండు గంటల సమావేశం జరిగింది.

సమావేశంలో జరిగిన చర్చలు విజయరామరాజు వైఖరి ఇతర విషయాలు కంపెనీ అధికారులకు అంతగా నచ్చలేదు. రాజు వైఖరి అధికారులకు తీవ్రమైన అసంతృప్తి కలిగించింది. బకాయిలు చెల్లించకపోవడం ఒక లోపం అయితే ఇతర రాజులందర్నీ కూడగట్టడం మరో ఇబ్బందని అందువల్ల అధికారుల నిర్ణయాన్ని ఉల్లంఘిస్తే తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరించాడు.

"కంపెనీ ఇచ్చే భరణం తనకు ఏ మాత్రం సరిపోదు అందువల్ల తాను మరో ప్రాంతానికి వెళ్ళిపోతే తనకు వివిధ రకాల ఖర్చులు ఎక్కువగా ఉంటాయని అందువల్ల నెలకు కనీసం రూ.30వేలు అయినా భరణంగా ఇవ్వాలి." అని విజయరామరాజు అభ్యర్ధించాడు.

బ్రిటిష్ ఛీఫ్ పరిశీలిస్తామని అన్నాడు కాని సరైన హామీ ఇవ్వలేదు

తీవ్ర నిరాశతో విజయరామరాజు వెనుతిరిగాడు.

ఆ మరునాడు మరోసారి ఛీఫ్‌ని కలుసుకున్నాడు.

"తన వద్ద ఉన్న సిబ్బందికి జీతాలు ఇతర ఖర్చులు చాలా అయ్యాయని వాటిని చెల్లించకుండా తాను ఇక్కడినుంచి దూర ప్రాంతాలకు వెళ్ళడం కష్టమని" అన్నాడు.

"ఏమి చేయమంటారు?"

"తనకు డబ్బులు అవసరం ఎంతో ఉంది. బ్రిటిష్ అధికారులు అన్ని రకాలుగా తనను దిగ్బందం చేసారు. అశక్తుడిగా చేసారు" అన్నాడు.

ఛీఫ్ విశాఖపట్నంలో ఉన్న తన సిబ్బందిని పిలిపించి రూ.30వేల రూపాయలను విజయరామరాజుకు అందించాడు.

సంచితో నగదుని అందుకున్నప్పుడు విజయరామరాజు చేతులు తడబడ్డాయి. కళ్ళల్లో నీరు తిరిగాయి.

ఎంతోమంది సిబ్బందిని పెంచి పోషించి రకరకాల సహాయ కార్యక్రమాలను అందించి ఒక సంస్థానానికి అధిపతిగా ఉన్న తాను లండన్ నుంచి వచ్చిన బ్రిటిష్ అధికారినుంచి డబ్బులు తీసుకోవడం సిగ్గులా అనిపించింది. తన పరిస్థితి ఎందుకిలా అయిపోయిందా అని మనసులో ఎంతో మదనపడ్డాడు.

మనసంతా వికలం అయిపోయింది

అధికారి నుంచి సెలవు తీసుకుని కార్యాలయం బైటికి వచ్చాడు.

***బ్రిటిష్ అధికారుల పితలాటకం***

మద్రాసులో ఉన్న బ్రిటిష్ అధికారులు విజయరామరాజుకు లేఖకు రాసారు. అందులో "విశాఖపట్నంలో ఉన్న తమ సిబ్బందికి లేఖ రాసామని వారు న్యాయం చేస్తారని" పేర్కొన్నారు. మే 31న రాసిన ఈ లేఖ విజయరామరాజుకు ఎంతో ఆశాజనకంగా అనిపించింది. తనపట్ల మద్రాసు అధికారులు సానుకూలంగా ఉన్నారని అనుకున్నాడు.

మద్రాసు అధికారుల సూచనల మేరకు తనకు అందిన లేఖవల్ల విశాఖపట్నం అధికారులు తనకు న్యాయం చేస్తారని ఆశించాడు. తనకు మళ్ళీ విశాఖపట్నం నుంచి పిలుపు వస్తుందని ఎంతో ఆశతో ఎదురు చూసాడు.

కానీ ఎటువంటి స్పందన కనిపించలేదు.

తర్వాత విశాఖపట్నం ఛీఫ్ వరుసగా మూడు హెచ్చరిక లేఖలను విజయరామరాజుకు పంపించాడు. 1794 జూన్ 3న వచ్చిన దాంట్లో మద్రాసు కాని మచిలీపట్నం ఎప్పుడు వెళుతున్నారని ప్రశ్నించారు జూన్ 13న రాసిన లేఖలో సిబ్బంది విషయంలో నగదు పరిహారం ఇవ్వడానికి కుదరదని తెలియజేసారు. జూన్ 22న రాసిన లేఖలో తక్షణమే మచిలీపట్నం తరలిపోకపోతే కంపెనీ చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

ఈ విషయాలు తీవ్ర మనస్థాపాన్ని కలిగించాయి.

మద్రాసు కంపెనీ అధికారులు రాసిన లేఖలలో తన వివిధ రకాల పరిహారాలు చెల్లించే విషయంలో ఎటువంటి ప్రస్తావన లేకపోవడం ఏదోలా అనిపించింది. అంతేకాకుండా తనను మద్రాసు కాని మచిలీ పట్నంకాని తరలిపొమ్మని మాత్రమే అందులో ఉండటం మరింత ఆందోళన కలిగించింది.

మొట్టమొదట మద్రాసు అధికారులు మే 30న తన విషయంలో నిర్ణయం తీసుకోమని రాసిన లేఖకు విశాఖపట్నం అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం వల్ల విజయరామరాజు విశాఖ అధికారులను మరోసారి కలవడానికి ఇష్టపడలేదు.

వారినుంచి ఎటువంటి ఆహ్వానం లేకపోవడం వల్ల తాను వెళ్ళకూడదని అనుకున్నాడు అతని వెనుక ఉన్న సంస్థానం ప్రతినిధులు కూడా అదే విషయాన్ని రాజుకు చెప్పారు.

ఈ విషయం మద్రాసు అధికారులకు ఆగ్రహాన్ని కలిగించింది

తాము రాసిన లేఖలకు విజయనగరం రాజు నుంచి ఎటువంటి స్పందనలేకపోవడం వారికి ఏదోలా అనిపించింది. అంతేకాకుండా విశాఖపట్నంలో ఉన్న కంపెనీ అధికారులు కూడా విజయరాజు వైఖరి పట్ల అంతసానుకూలంగా లేకపోవడం కూడా వారికి ఆగ్రహాన్ని తెప్పించడానికి కారణమైంది.

దీంతో వారు జూన్ 24న విశాఖ అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేసారు.

విజయరామరాజు తమ ఆదేశాలను పట్టించుకోవడం లేదని అందువల్ల అతడిపై యుద్ధం చేసి అయినా లొంగదీసుకోవాలని తక్షణమే విశాఖపట్నం నుంచి బ్రిటిష్ సైన్యాలను తరలించాలని ఈ ఆదేశాలలో పేర్కొన్నారు.

ఈ ఆదేశాలను అనుసరించి విశాఖపట్నం ఛీఫ్ స్పందించాడు.

జూలై 25న అతను విజయరామరాజుకు ఒక లేఖ రాసాడు. అందులో తమకు మద్రాసు గవర్నరు జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేయడానికి కల్నల్ పెండర్‌గాస్టు అనే అధికారిని నియమించామని ఆయన తమ వద్దకు వస్తున్నాడని తెలియజేసారు.

ఈ విషయం విజయరామరాజుకు కాస్త ఊరట కలిగించింది.

కల్నల్ పెండర్ గాస్టు తన వద్దకు వస్తే తన సిబ్బందికి చెల్లించవలసిన బకాయిల గురించి చర్చించే అవకాశం ఉందని లేదా ఆ బకాయిలను తీర్చడానికి కొంత ధనాన్ని తీసుకుని వస్తున్నాడని భావించాడు.

కానీ విజయరామరాజు అనుకున్న విధంగా జరగలేదు.

కల్నల్ పెండర్‌గాస్టు విశాఖ నుంచి బయలుదేరి జూలై 8న పద్మనాభంలో ఉన్న విజయరామరాజును కలుసుకున్నాడు. అతనికి ఒక లేఖను అందించాడు. ఆ లేఖలో తక్షణం ఈ ప్రాంతాన్ని వదిలి వెళ్ళిపోవాలని లేకపోతే సిబ్బందితో దాడి చేయించవలసి ఉంటుందని పేర్కొన్నాడు. ఇందుకు కేవలం 24 గంటల సమయం మాత్రమే ఇస్తున్నానని తెలియజేసారు.

వారి మధ్య ప్రత్యేకమైన మాటలేమీ జరగలేదు.

విజయరామరాజు కూడా కల్నల్ పెండర్‌గాస్టుకు లిఖిత పూరకంగానే జవాబు అందజేసాడు. ఆ వివరాలు మద్రాసులో ఉన్న కంపెనీ అధికారులకు అందుతాయని ఆయన నమ్మకం.

ఇందులో "నేను నా సిబ్బందిని సంతృప్తి పరచడానికి మాత్రమే పద్మనాభంలో ఉన్నాను. వారంతా నన్ను నమ్ముకుని నా వెనుక ఉన్న నా అనుచరులు.. అనుయాయులు. బంధువులు ప్రస్తుత పరిస్థితుల్లో నేను ఇక్కడి నుంచి తరలిపోవడానికి కంపెనీవారి ఆర్థికసాయాన్ని ఆర్థిస్తున్నాను. కానీ అధికారులు నాకు వ్యతిరేకంగా సైన్యాలను పంపించి నన్ను సంహరిస్తామని అనుకుంటే నేను ఏమి చేయగలను. గౌరవం కోసం బతుకుతున్న సుక్షత్రియ కుటుంబానికి చెందినవాడిని. మీ నిర్ణయంలో మార్పు రాకపోతే పిల్లలు కుటుంబీకులు ఇతతత అనుయాయులతో ప్రాణత్యాగం చేయడం మినహా చేయగలిగింది మరేమీ లేదు." అంటూ ప్రత్యుత్తరమిచ్చాడు

అదే ఆయన కంపెనీ అధికారులకు రాసిన చివరిలేఖ

పద్మనాభంలో మకాం

కల్నల్ పెండర్ గాస్టుతో సమావేశం జరిగిన తర్వాత విజయరామరాజులో ఒకలాంటి నిరాశానిస్పృహలు ఆవరించాయి. అతని మనసు మనసులో లేదు. ఎవరిమీదో తెలియని కోపం, ఉక్రోషం ఆందోళన మనసంతా ఆవరించాయి.

ఉదయం పదిగంటలు అయింది.

పద్మనాభం చిన్న కుగ్రామం. అక్కడ ఎత్తైన కొండమీద అనంత పద్మనాభస్వామి దేవాలయం ఉంది. కిందన కుంతీమాధవస్వామి ఆలయం ఉంది. పాండవుల కాలంలో కుంతీదేవి ఈ దేవాలయాన్ని నిర్మించారన్న చరిత్ర కూడా ఉంది.

ఆ దేవాలయం విజయనగరం సంస్థానాధీశుల ఆధీనంలో ఉంది.

ఈస్టుఇండియా కంపెనీ వారు తీసుకున్న నిర్ణయం ఎటువంటి పరిణామాలకు దారి తీస్తుందో తెలియడంలేదు. తనకు మరణం ఆసన్నమైతే అది పద్మనాభస్వామి సమక్షంలోనే జరగాలని మనసులో నిర్ణయించుకున్నాడు.

విజయరామరాజు అత్తగారి ఊరు అన్నమరాజు పేట

ఈ గ్రామం పద్మనాభం సమీపంలో ఉంది. ఈ పరిసర ప్రాంతాలలో అలవకుండ, జామి వంటి ప్రాంతాలలో ఎంతోమంది రాజులు వారి కుటుంబాలు ఉన్నాయి పూసపాటి వారి బంధువర్గం కూడా ఎంతోమంది ఉన్నారు. అందువల్ల పద్మనాభం వంటి పవిత్రమైఅన్ ప్రాంతంలో ఉంటే తనకు అన్ని విధాల రక్షణ ఉంటుందని ఆయన భావించాడు. అందుకు అనుగుణంగానే ప్రయత్నాలు కూడా చేసాడు.

బ్రిటిష్ కంపెనీ అధికారులతో తాడోపేడో తేల్చుకోవాలని నిర్ణయించిన తర్వాత విజయమో వీరస్వర్గమో ఏదో ఒకటి సంభవిస్తుంది. దేనికైనా సిద్ధపడి ఉండాలని ఆయన అనుకున్నాడు. మందీ మార్బలం ఆర్ధిక పరిపుష్టి ఆయుధ సంపత్తులు ఉన్న బ్రిటిష్ అధికారులతో ఎదురు నిలిచి పోరాటం చేయడమన్నది చిన్న విషయం కాదు. విజయం సాధించాలన్న పట్టుదలతో ముందుకు ఉరకాలి కాని విధి వక్రీకరిస్తే విజయరామరాజులో అంతరంగ తరంగాలు ఆలోచనా మధనం జరిగింది.

పద్మనాభం నుంచి యుద్ధాన్ని ఆరంభిస్తే తనకు అనుకూలంగా ఉన్న సామంతరాజులు ఇతర సంస్థానాధీశులు అండదండలు ఉంటాయి. తన మద్దతుదారులు వందలాదిమంది పద్మనాభం పరిసర ప్రాంతాలలో ఉంటున్నారు. అందువల్ల ఈ సంగ్రామం ఎన్నిరోజులు జరిగినా తన సైన్యానికి తిండి ఇతర సహాయ సహకారాలు లభించడానికి ఎటువంటి ఇబ్బంది ఉండదన్న నమ్మకం వల్ల కూడా ఆయన పద్మనాభాన్ని ఎంచుకున్నారు.

పద్మనాభం కాకుండా సింహాచలంలోనో విశాఖపట్నం పరిసర ప్రాంతాలలోనో మకాం పెడితే కంపెనీ సాయుధ దళాలు ఆ ప్రాంతాన్ని దిగ్బందం చేసి ఆహార సరఫరా ఆయుధాల సరఫరా వంటి వాటిని నిలుపుదల చేయించే ప్రమాదం ఉంది. అటువంటప్పుడు విజయనగరం కోటను తిరిగి స్వాధీనం చేసుకోవడం కష్టం అవుతుంది. అమ సైనికులు పోరాటం చేయడం కూడా చాలా ఇబ్బంది అవుతుంది. అందువల్ల అన్నింటికీ అనుకూలంగా ఉన్న పద్మనాభంలోనే నివాశం ఏర్పాటు చేసుకోవాలని విజయరామరాజు నిర్ణయించుకున్నాడు.

అతని అభీష్టం మేరకు పద్మనాభంలో ఉండటానికి నిర్ణయం జరిగింది.

పద్మనాభం ఇసుకలపాలెం మధ్యలో నివాసం ఏర్పాటు అయింది.

ఆ పరిసర ప్రాంతాలలో ఇతర అభిమానులు సైనికులు శిబిరాలను ఏర్పాటు చేసుకున్నారు. మద్ది వద్ద ఒక పటాలం, కృష్ణాపురం వద్ద మరో పటాలం, శేరీఖండనం వద్ద మరోపటాలం ఇలా ఒకో ప్రాంతంలో ఒక బృందంగా సైనికులు నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు.

***(ముగింపు వచ్చేనెలలో)***

Post your comments